# బతుకమ్మ ఉత్సవాలను ఆనందంగా జరుపుకోవాలి

### కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

కామారెడ్డి, అక్టోబర్ 18 : బతుకమ్మ ఉత్సవాలను ఆనందోత్సవాల మధ్య ఘనంగా జరుపుకోవాలని కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ మహిళలకు సూచించారు. స్వీప్ కార్యక్రమాల్లో భాగంగా స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో బుధవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. సాయంత్రం స్వీప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బతుకమ్మ సంబురాల్లో మహిళలు బతుకమ్మలతో ఆడిపాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్వీప్ బతుకమ్మను మహిళలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పూలను పూజించే, ప్రకృతిని ఆరాధించే పండుగ బతుకమ్మ అని అన్నారు. తీరొక్క పూలతో తీర్చిదిద్ది ఆనందోత్సవాల మధ్య జరుపుకొనే ఈ పండుగతోపాటు త్వరలో రాష్ట్ర శాసనసభకు జరగబోయే ఎన్నికల్లో ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటు వేసేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో స్వీప్ నోడల్ అధికారి శ్రీధర్‌రెడ్డి, మహిళలు పాల్గొన్నారు.



కామారెడ్డిలో బతుకమ్మను ఎత్తుకున్న కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

**పలు కళాశాలల్లో..**

దోమకొండ/తాడ్వాయి/మద్నూర్/కామారెడ్డి, అక్టోబర్ 18 : దోమకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించారు. బతుకమ్మ పాటలపై నృత్యాలు చేశారు. అనంతరం బతుకమ్మలను కళాశాల వద్ద ఉన్న నీటి కుంటలో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జైపాల్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. తాడ్వాయిలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో విద్యార్థినులు, అధ్యాపకులు బతుకమ్మ సంబురాలను నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు సరస్వతి, హారిక, వీరేశం, సంతోష్, ప్రిన్సిపాల్ సయ్యద్ యూసుఫ్ హుస్సేన్ పాల్గొన్నారు. మద్నూర్‌లోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులు సంబురాలు నిర్వహించారు. కామారెడ్డిలోని సాందీపని డిగ్రీ కళాశాల, శ్రీ ఆర్యభట్ట కళాశాలలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు.



సాందీపని డిగ్రీ కళాశాలలో..



దోమకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..



తాడ్వాయిలో..



మద్నూర్‌లో..

## కేసీఆర్‌ను భారీ మెజారిటీతో గెలిపిస్తాం



మంత్రి కేటీఆర్‌ను కలిసిన
జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పున్న రాజేశ్వర్

కామారెడ్డి,అక్టోబర్ 18 : ప్రగతి భవన్‌లో బుధవారం కామారెడ్డి ముఖ్య నాయకులతో సమావేశమైన సందర్భంగా రాష్ట్ర ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్‌ను కామారెడ్డి జిల్లా గ్రంథాలయ చైర్మన్ పున్న రాజేశ్వర్ మర్యాదపూర్వకంగా కలిశారు. సీఎం కేసీఆర్ పోటీ చేయడం కామారెడ్డి ప్రజల అదృష్టమని.. కేటీఆర్ ఇన్‌చార్జిగా రావడం మరింత అదృష్టమన్నారు. కేసీఆర్‌కు భారీ మెజారిటీతో విజయాన్ని అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకుడు గెరిగంటి లక్ష్మీనారాయణ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జైలులో మగ్గిపోయిన వారిని గుర్తించాలి



కలెక్టర్ జితేశ్ వీ పాటిల్, ఎస్పీ సింధు శర్మతో మాట్లాడుతున్న
జిల్లా జడ్జి ఎస్ఎన్ శ్రీదేవి

కామారెడ్డి, అక్టోబర్ 18 : జిల్లా కేంద్రంలోని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యాలయంలో బుధవారం అండర్ ట్రయిల్ రివ్యూ కమిటీని ప్రారంభించారు. ఈ కమిటీలో జిల్లా జడ్జి ఎస్ఎన్ శ్రీదేవి, కలెక్టర్ జితేశ్ వీ పాటిల్, ఎస్పీ సింధుశర్మ, సబ్ జైల్ సూపరింటెండెంట్ గంగాకిషన్‌తో కలిసి రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ.. జైలులో చాలా సంవత్సరాలుగా బెయిల్ వచ్చినప్పటికీ శూరిటి లేక జైలులోనే మగ్గిపోతున్నారని, అలాంటి వారిని గుర్తించాలని సూచించారు. రాష్ట్రానికి నివేదిక అందజేయాలన్నారు. అర్హులైన అండర్ ట్రయల్ ఖైదీలను విడుదల చేసేందుకు ఈ కమిటీని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా నలుగురు ఖైదీలను విడుదల చేయాలని తెలంగాణ రాష్ట్ర లీగల్ సర్వీస్ అథారిటీకి సిఫార్స్ చేసినట్లు తెలిపారు.

## నేటి నుంచి పలు గ్రామాలకు నీటి సరఫరాలో అంతరాయం

బాన్సువాడ, అక్టోబర్ 18 : ఉమ్మడి జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో మిషన్ భగీరథ నీటి సరఫరాను నిలిపివేస్తున్నట్లు మిషన్ భగీరథ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వెంకటేశ్వర్ గౌడ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జుక్కల్ సెగ్మెంట్ పరిధిలోని సింగూర్ -145 ఎమ్మెల్డీ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ ప్రధాన పైపులైన్‌లో లీకేజీ ఏర్పడిందని తెలిపారు. మరమ్మతుల నేపథ్యంలో బాన్సువాడ, బోధన్, జుక్కల్ నియోజకవర్గాలు, ఎల్లారెడ్డి నియోజకవర్గ పరిధిలోని ఎల్లారెడ్డి, లింగంపేట్, నాగిరెడ్డిపేట్ మండలాల పరిధిలోని గ్రామాలకు గురువారం నుంచి శనివారం వరకు మిషన్ భగీరథ తాగునీరు సరఫరాలో అంతరాయం ఉంటుందని వివరించారు. ప్రజలు సహకరించాలని, ఆయా గ్రామాల్లో బోరుబావుల నీటిని వాడుకోవాలని కోరారు.

## విద్యుత్ బిల్లులు ఆన్‌లైన్‌లోనే చెల్లించాలి

సదాశివనగర్/ నిజాంసాగర్/ పిట్లం, అక్టోబర్ 18: విద్యుత్ బిల్లులను ఆన్‌లైన్‌లోనే చెల్లించాలని ట్రాన్స్ కో అధికారులు సూచించారు. మండలంలోని మర్కల్ గ్రామంలో విద్యుత్ బిల్లుల చెల్లింపుపై బుధవారం గ్రామస్తులకు అవగాహన కల్పించారు. స్థానిక గ్రామ పంచాయతీ వద్ద ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో అధికారులు మాట్లాడుతూ.. డిజిటల్ విధానంలో విద్యుత్ బిల్లులు చెల్లిస్తే ఎలాంటి ఇబ్బందులూ ఉండవని అన్నారు. ప్రతి ఒక్కరూ ఆన్‌లైన్‌లో బిల్లులు చెల్లించేలా అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ సంగారెడ్డి, ట్రాన్స్‌కో అధికారులు షాపూరి శ్రీనివాస్, సురేశ్, వెంకటేశ్ గౌడ్, కామారెడ్డి సర్కిల్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు. నిజాంసాగర్‌లోని ట్రాన్స్‌కో ఏఈ లక్ష్మణ్ ఆధ్వర్యంలో డిజిటల్ చెల్లింపులపై వినియోగదారులకు అవగాహన కల్పించారు. సెల్‌ఫోన్ ద్వారానే బిల్లు చెల్లించే వీలు ఉన్నదని తెలిపారు. వినియోగదారులు డిజిటల్ చెల్లింపులపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ గంగాధర్, సబ్ ఇంజినీర్ అక్షయ్‌కుమార్, సుదర్శన్, లక్ష్మన్, రాజు తదితరులు పాల్గొన్నారు. పిట్లంలోని విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద ఆన్‌లైన్‌లో బిల్లుల చెల్లింపుపై వినియోగదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏడీఈ రామకృష్ణ మాట్లాడుతూ.. వినియోగదారులు ఆన్‌లైన్‌లోనే బిల్లులు చెల్లించాలని సూచించారు. పిట్లం, నిజాంసాగర్ మండలాల్లో 80శాతం మంది వినియోగదారులు ఆన్‌లైన్‌లోనే బిల్లులు చెల్లిస్తున్నారని, మిగిలిన వారు కూడా ఆన్‌లైన్‌లోనే చెల్లించాలన్నారు. ఏఏవో యువరాయ్, జేఏవో అశోక్, జూనియర్ అసిస్టెంట్ దయాళ్, లైన్‌మన్ సుదర్శన్, సిబ్బంది రాఘవేంధర్‌యాదవ్, రాజశేఖర్, ప్రవీణ్, రోహన్ తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారులతో సరదాగా గడిపిన స్పీకర్



బాన్సువాడ టౌన్, అక్టోబర్ 18ః బాన్సువాడలో నూతనంగా ప్రారంభించిన మల్టీజనరేషన్, చిల్డ్రెన్ పార్కులను స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి బుధవారం సందర్శించారు. చిన్నారులతో కలిసి చిరుతిండ్లు తింటూ ఆనందంగా గడిపారు. స్పీకర్ పోచారంతో సెల్ఫీలు దిగితూ చిన్నారులు సంతోషం వ్యక్తం చేశారు.




## వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు



రామారెడ్డి మండలం పోసానిపేట్‌లో నిర్వహించిన కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు

నిజాంసాగర్/ ఎల్లారెడ్డి/ గాంధారి/ రామారెడ్డి, అక్టోబర్18: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజు బుధవారం అమ్మవారు శ్రీమహాలక్ష్మి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. నిజాంసాగర్ మండలంలోని మాగి గ్రామంలో దుర్గామాత మండపం వద్ద కుంకుమ పూజలు నిర్వహించారు. సర్పంచ్ అంజయ్యతోపాటు మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నర్వ గ్రామ దుర్గామాత మండపం వద్ద సర్పంచ్ సంగమణీ రాములు హోమం నిర్వహించిన అనంతరం పూజ, అన్నదానం కార్యక్రమాలు కొనసాగాయి.

ఎల్లారెడ్డి పట్టణంలోని శ్రీరామ్ సేనా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి మండపంలో శివ పార్వతుల కల్యాణం నిర్వహించారు. కల్యాణానికి పట్టణంలోని అన్ని మండపాల వద్ద ఉన్న భవానీ మాలధారులు, భక్తులను ఆహ్వానించారు. వారికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పలువురు వ్యాపారులు, మహిళలు పాల్గొన్నారు.

గాంధారి, పొతంగల్ కలాన్, గండివేట్, గౌరారం, బ్రాహ్మణ్‌పల్లి, గుర్జాల్, మాతు సంగెం, పేట్ సంగెం, ముదెల్లి తదితర గ్రామాల్లోని దుర్గామాత మండపాల్లో ప్రత్యేక పూజలు కొనసాగాయి. గాంధారి దుర్గాసేనా యూత్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రామారెడ్డి మండలంలోని పోసానిపేట్ గ్రామంలో ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో నెలకొల్పిన దుర్గామాత మండపం వద్ద మహిళలు కుంకుమార్చన నిర్వహించారు. దుర్గామాత 29వ వార్షికోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు బట్టు ఆనంద్ తెలిపారు. యూత్ సభ్యులు శివయ్య, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.